ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

మంగళవారం 30 జనవరి 2024



ఈపీఎఫ్ ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి కృషి 7లో..

8లో.. గని ప్రమాద బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఎండిపోయిన కుంటలు

- చివరి ఆయకట్టుకు అందని నీరు
- నెర్రెలుబారుతున్న భూములు
- ఆందోళనలో రైతులు



నీరు లేక ఎండిపోతున్న మొక్కజొన్న పంట



ఓదెల శివారులోని ఎండిపోయిన సూరంకుంట

ఓదెల, జనవరి 29: పక్కనే డీ-86 కాల్వనిండా సాగునీరు పారుతున్నప్పటికీ 40 ఎకరాల సాగు భూములు ఎండిపోతున్నాయి. ఓదెల, కనగర్తి శివారులో ఉన్న సూరంకుంట, రాళ్లకుంటల్లోకి నేటికీ కాలువ నీరు రాలేదు. డీ-86 కాల్వకు గతంలో తూము నిర్మించారు. కాలువ నీరు విడుదల చేసినప్పుడల్లా ఈ తూము నుంచి నీరు వచ్చి సూరంకుంట, రాళ్లకుంట, తుమ్మలకుంటలు నిండి ఆయకట్టు నలభై ఎకరాల భూములు గతంలో సాగు అయ్యేవి. కానీ ప్రధాన కాలువ గుండా వస్తున్న తూము నీటిని కొంతమంది అడ్డుకోవడం వల్ల పదేళ్ల నుంచి నీరు లేక పంటలు, కుంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో వరి పంటలు సాగు చేసిన రైతులు చింతం చందు, ముద్దసాని కొమురయ్య, సూరం మల్లయ్య, ముద్దసాని చేరాలు, చింతం కొమురయ్య, దిడ్డిగి రాజేశం, బియ్యాల సమ్మయ్య, చింతం మొగిలి, వంగల సదానందం, దిడ్డిగి కొమురయ్యలు ప్రస్తుతం మొక్కజొన్న పంటలు సాగు చేశారు. అలాగే ఇందులో మరో కొందరు రైతులు సాగునీరు లేక భూము లను బీళ్లుగా ఉంచుకున్నారు. వేసిన పంటలకు నీటి చుక్క అందక ఎండిపోయే దశకు చేరుకున్నాయి. గతంలో కూడా సాగు నీటి కోసం ఇరిగేషన్ డీఈ, ఏఈలకు రైతులు ఫిర్యాదు చేసి, తమ ఇబ్బందులను మొరపెట్టు కున్న కూడా నేటి వరకు ఏ అధికారి స్పందించి రైతులను ఆదుకోకపోవడం గమనార్హం. అయినా గత ప్రభుత్వం పెద్దలకు చెప్పిన కూడా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కాలువ నీటితో కుంటలను నింపి సాగు చేసిన పంటలను కాపాడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

పదేళ్ల నుంచి నష్టపోతున్నాం..

- చింతం మొగిలి రైతు, ఓదెల



కుంటల్లోకి కాలువ నీరు రాక పదేళ్ల నుంచి నష్టపోతున్నాము. పంటలను కాపాడుకోవడం కోసం సాగునీరు కావాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. మాకు కుంటలను నింపి వెంటనే ఆదుకోకపోతే వేసిన మొక్కజొన్న పంట ఎండిపోయే ప్రమాదం ఉంది.

పెద్దపల్లి బైపాస్ ప్రతిపాదిత మార్గం పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి బైపాస్ నిర్మాణం కోసం హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ, ఆర్అండ్బీ అధికారులతో కలిసి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రతిపాదిత మార్గాన్ని సోమవారం పరిశీలించారు. పెద్దకల్వల నుంచి నిట్టూరు, నిమ్మనపల్లి, గుంటూరుపల్లి, చందపల్లి గ్రామాల శివారు నుంచి హైదరాబాద్కు వెళ్లే హెచ్ఎండీఏ తాగునీటి పైప్లైన్ గుండా అప్పన్నపేట వరకు బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పెద్దపల్లిలో బైపాస్ నిర్మిస్తామని విజయరమణారావు హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆయన వారం రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా కేంద్రం కావడంతో పట్టణంలో వాహనాల రద్దీ పెరిగిందని, ఈ కారణంగా పలు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఇక్కడ బైపాస్ నిర్మాణం తక్షణ అవసరమని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో సంబంధిత విభాగం అధికారులు పెద్దపల్లికి రావడంతో వారితో కలిసి బైపాస్ రోడ్డు ప్రతిపాదన మర్గాన్ని పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి కొంత మేరకు భూసేకరణ కూడా చేపట్టాల్సి ఉంటుంది. ఈ మేరకు సంబంధిత అధికారులు మాట్లాడుతూ డీపీఆర్ను రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తామని చెప్పారు.

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

యైటింక్లయిన్కాలనీ, జనవరి 29: తెలంగాణ జాగృతి, ధృవ పాండవ్ క్రికెట్ క్లబ్ ల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అబ్దుల్ కలాం స్టేడియంలో అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు జరిగాయి. తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకుడఓ కందెం సురేష్ పోటీలను ప్రారంభించారు. ఈపోటీల్లో మొత్తం ఆరు జట్లు పాల్గొన్నాయి. సెక్టార్-3 సింగరేణి, శాంతినికేతన్ జట్లు పోటీ పడగా సింగరేణి స్కూల్ జట్టు విజేతగా నిలిచింది. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్జీ-2 బ్రాంచి కార్యదర్శి జిగురు రవీందర్ గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కందెం సురేష్, నర్సింహారెడ్డితో పాటు ధృవపాండవ క్రికెట్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

స్పెల్ విజార్డ్, డ్రామా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కాల్వశ్రీరాంపూర్, జనవరి 29: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు నిర్వహించిన స్పెల్ విజార్డ్, డ్రామా పోటీల్లో ప్రతిభ కనబరిచారు. స్పెల్ విజార్డ్ పోటీల్లో వెన్నంపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్ రాంచరణ్ (ప్రథమ), పెగడపల్లికి చెందిన పీ రస్మిత(ద్వితీయ) సాధించారు. అదే విధంగా డ్రామా పోటీల్లో పెగడపల్లి ఉన్నత పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాల, మోడల్ స్కూల్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ డ్రామా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ మండల కన్వీనర్ సత్యప్రకాష్రావు, ఆంగ్ల ఉపాధ్యాయులు వెంకటేష్, హరీష్, కృష్ణమూర్తి, భాస్కర్, శ్రీనివాస్, సునీల్, చక్రవర్తి, రాజమౌళి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్మెంట్ను వెంటనే విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 29: పెండింగ్ స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ అదనపు కలెక్టర్కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆర్ల సందీప్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. అలాగే పెండింగ్లో ఉన్న మెస్, కాస్మోటిక్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఎస్సీ (ఎస్ఎంహెచ్) బాలికల కళాశాల హాస్టల్ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు పక్కా భవనం నిర్మించాలని, జిల్లా కేంద్రంలోని గురుకుల హాస్టల్స్ అన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. వాటికి వెంటనే పక్కా భవనాలు నిర్మించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని అన్నారు. వెల్ఫేర్ హాస్టల్స్ మరియు గురుకులాల్లో ఏఎన్ఎంలను నియమించాలని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలన్నారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించా రు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్ధార్థ, నిఖిల్, శ్రావణ్, అజయ్, భరత్, పాల్గొన్నారు.

‘ఎల్లంపల్లి’ అధికారికంగా ప్రారంభమయ్యేనా?

- పట్టించుకోని గత ప్రభుత్వం - కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ప్రారంభించాలని డిమాండ్ - 2016 నుంచే సాగు నీటి సరఫరా

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నేటికి కూడా అధికారికంగా ప్రారంభం కాలేదు. అయినా ఏడు సంవత్సరాల నుంచి సాగు నీటిని సరఫరా చేస్తున్నారు. గత నెలలో రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లు సాధించి అధికారంలోకి రావడంతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అంశం తెరపైకి వచ్చింది. ఆదివారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ప్రస్తావన తీసుకువచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఎల్లంపల్లి ప్రాజెక్టు అప్పుడే 80 శాతం వరకు పనులు పూర్తి కాగా, ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్ చేసినప్పటికీ వాయిదా పడిందని, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం ప్రాజెక్టు ప్రారంభం గురించి పట్టించుకోలేదని, ఇప్పటికైనా అధికారికంగా ప్రాజెక్టును ప్రారంభించుకోవాలని మంత్రిని కోరారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా వైఎస్ఆర్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత జలయజ్ఞం పేరిట పలు ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2004 జూలై 28న వైఎస్ఆర్ ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణ పనులను ప్రారంభించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా ఎన్టీపీసీకి విద్యుత్ ఉత్పత్తి కోసం ఆరు టీఎంసీల నీటిని ఇవ్వడంతో పాటు హైదరాబాద్ నగర ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఇక్కడి నుంచే నీటిని సరఫరా చేసేందుకు పైప్లైన్ నిర్మించారు. మంథని, చొప్పదండి, వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని చెరువులను నింపి తద్వారా రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలని నిర్ణయించారు. మొదటి దశ పనులు పూర్తయినప్పటికీ, రెండో దశ పనులు ఇంకా పూర్తి కాలేదు. ప్రస్తుతానికి ఈ ప్రాజెక్టు నుంచి ఎన్టీపీసీకి, ఆర్ఎఫ్సీఎల్కు, హెచ్ఎండీఏకు నీటిని సరఫరా చేయడంతో పాటు కొంత ఆయకట్టుకు సాగు నీటిని విడుదల చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టుకు కూడా దీనికి అనుసంధానం చేశారు. కాంగ్రెస్ హయాంలోనే బ్యారేజీ నిర్మాణం, పైపు లైన్లు, గ్రావిటీ కాలువల నిర్మాణాలు, పంప్‌హౌస్‌లు పూర్తి కాగా, గేట్ల బిగింపు, తదితర



పనులను తెలంగాణ వచ్చిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేసింది. 2016 ఆగస్టు 4వ తేదీ నుంచే సాగు నీటిని అందిస్తున్నారు. కాంగ్రెస్ హయాంలోనే దివంగత స్పీకర్ శ్రీపాదరావు పేరును ప్రాజెక్టుకు నామకరణం చేశారు. 2013లో ఎల్లంపల్లి ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అధికారికంగా ఆరంభించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ప్రాజెక్టు వద్ద ఒక పైలాన్‌ను కూడా నిర్మించారు. శిలా ఫలకాలను కూడా సిద్ధం చేశారు. అప్పటికి తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతుండడంతో ఆరంభం నిలిచిపోయింది. ప్రాజెక్టు వద్దకు ఎవరు రాకుండా ఉద్యమకారులు అడుగడుగునా ఆటంకాలు సృష్టించడంతో ప్రారంభం నిలిచిపోయింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2016 ఆగస్టు 4న పనులు పూర్తయ్యాయి. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా ఆరంభించలేదు. దాని గురించి పెద్దగా పట్టించుకోలేదు. ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టుకు రీడిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టి దానిపైనే ఎక్కువగా దృష్టి సారించారు. నెలరోజుల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించాలనే డిమాండ్ తెరపైకి వస్తున్నది. ప్రాజెక్టు వద్ద ఉన్న పైలాన్ శిలా ఫలకం లేక వెక్కిరిస్తుండడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రారంభించాలని అభిప్రాయపడుతున్నారు.

మోసం చేశారు.. న్యాయం చేయండి

- కలెక్టరేట్ ఎదుట బాధితుడి ఆవేదన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధితుడు

పెద్దపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తన తండ్రికి చెందిన సర్వే నంబర్ 478/డిలో ఎనిమిది గుంటల భూమిని కొందరు వ్యక్తులు కాజేశారని పేర్కొంటు చిన్నకల్వలకు చెందిన కల్వల శంకర్ అనే బాధితుడు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఫ్లెక్సీతో నిరసన వ్యక్తం చేశారు. పెద్దబొంకూర్ సర్పంచ్ భర్త కారుపాకల సంపత్‌కుమార్, సస్పెండైనా వీఆర్ఏ కలవేన శంకర్, చిన్నకల్వల సర్పంచ్ ఏరుకొండ రమేష్ తన తండ్రి భూమి ఎనిమిది గుంటలను కాజేశారని అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని, పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో నిరసన తెలుపుతున్నట్లు బాధితుడు పేర్కొన్నారు. వెంటనే భూమిని కాజేసిన వ్యక్తులపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

‘పది’ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

జూలపల్లి, జనవరి 29. ప్రభుత్వ పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు కృషిచేయాలని అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ అన్నారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం అదనపు కలెక్టర్ అరుణశ్రీ సందర్శించి విద్యార్థుల ప్రత్యేక తరగతులపై అధికారులు, ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలోని పదోతరగతి ఫలితాలు ఆశించిన స్థాయిలో రాలేదన్నారు. ప్రస్తుత పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టిసారించి ఉత్తమ ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు అందించే సూచనలను పాటిస్తూ విద్యార్థులు చదువుకోవాలని, ప్రత్యేక తరగతులకు తప్పక హాజరుకావాలని అదనపు కలెక్టర్ సూచించారు. పదో తరగతి విద్యార్థుల కోసం సెలవు రోజుల్లోను ప్రత్యేక తరగతులు నిర్వహించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటాలని, వాటితో పచ్చదనం, మంచి వాతావరణం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఎంఈవో కవిత, ఎంపీవో కిరణ్‌ఖ, హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సునీల్‌రెడ్డిని సన్మానించిన బీజేపీ నేతలు

మంథని, జనవరి 29: పెద్దపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన చంద్రుపట్ల సునీల్‌రెడ్డిని మంథని బీజేపీ నేతలు సోమవారం ఘనంగా సన్మానించారు. సునీల్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన వారు పూల మాలలు, శాలువాలతో సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పార్టీలో అందరి కలిసి పని చేస్తూ జిల్లాలో బీజేపీని మరిం త బలోపేతం చేస్తానని ఈసందర్భంగా సునీల్‌రెడ్డి వెల్లడించారు. ఈకార్యక్రమంలో నేతలు నాంపెల్లి రమేష్, రావర్తి సంతోష్, బోగోజు శ్రీనివాస్‌లు ఉన్నారు.



సునీల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మంథని, జనవరి 29: జాతీయస్థాయి కరాటే పోటీలో మంథని జపాన్ షిటోరియో కరాటే విద్యార్థుల ప్రతిభను కనబర్చి పథకాలు సాధించినట్లు కోచ్ కావేటి సమ్మయ్య సోమవారం తెలిపారు.

ఆదివారం మంచిర్యాలలోని పద్మనాయ కకల్యాణ మండపంలో జాతీయస్థాయి కరాటే పోటీలో తన ఆధ్వర్యంలో పాల్గొన్న విద్యార్థులు కటా, కుమిత్ విభాగాలలో అత్యంత ప్రతిభ కనబరిచి బంగారు వెండి పథకాలు సాధించినట్లు వెల్లడించారు. తాటి క్రిష్ విరాట్, బండారి మణికంఠలు గోల్డ్, బెజ్జంకి అక్షయ కీర్తన్ ఎండీ ఇక్రంలు సిల్వర్ మెడల్స్ సాధించనట్లు తెలిపారు. పథకాలు సాధించిన వారిని కాయ్ రాష్ట్ర అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వినరేందర్, కోశాధికారి సాయికుమార్ , జపాన్ సిటోరియో కరాటే రాష్ట్ర అధ్యక్షుడు, కాయ్ రెఫరీ కమీషన్ చైర్మన్ పాలకుర్తి పాపయ్య మాడ సంపత్ అభిందించారు.

పరిశ్రమలు, ప్రభుత్వశాఖల సమన్వయంతో జాతర ఏర్పాట్లు చేయాలి

సమ్మక్క- సారక్కలకు పోలీస్‌లు గౌరవంగా స్వాగతం పలకాలి

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



గోదావరిలో స్పీడ్ బోట్ నడుపుతున్న ఎమ్మెల్యే

కోల్‌సిటీ, జనవరి 29: గోదావరిఖనిలో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు పరిశ్రమలు, ప్రభుత్వశాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. సోమవారం గోదావరి తీరంలో సమ్మక్క-సారలమ్మ జాతర స్థలాన్ని ఆయన పరిశీలించారు. గద్దెల వద్ద కొబ్బరికాయలు కొట్టి ఏయే పనులు చేయాలనే విషయంపై అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా జాతర పరిసరాల్లో సింగరేణి సంస్థ ఓబీ మట్టి నింపి లెవలింగ్ చేయాలన్నారు. వాణిజ్య దుకాణాలు, పోలీస్ కంట్రోల్ రూమ్, వార్ రూమ్స్, మెడికల్ రూమ్, మీడియా సెంటర్, ఎంట్రీ, ఎగ్జిట్‌లు పొందుపరిచే లే ఔట్‌ను తయారు చేసి దాని ప్రకారమే ఏర్పాట్లు చేయాలన్నారు. జాతర వైపు ఉన్న శ్మశాన వాటిక గోడకు ఎత్తు పెంచాలని, తాత్కాలికంగా తడకలతో కట్టాలన్నారు. గోదావరి ఒడ్డు ప్రాంతాన్ని శుభ్రం చేయాలని, ప్లాస్టిక్, ఇతర చెత్త వేసేందుకు డబ్బాలు ఏర్పాటు చేసి అందులోనే చెత్త వేసేలా భక్తులకు అవగాహన కల్పించాలన్నారు.

అమ్మవార్ల గద్దెలకు కొత్త టైల్స్ వేయడంతో పాటు లోపల తాండూరు రాయితో నున్నగా చేయించాలన్నారు. పుష్కర ఘాట్ వద్ద కొంత దూరం ఫ్లోరింగ్ చేయించాలని, ఈ బాధ్యత ఎన్టీపీసీ తీసుకోవాలన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. జాతరలో సింగరేణి, ఎన్టీపీసీ తమతమ సిబ్బందితో పాటు అదనపు పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. లైటింగ్ ఏర్పాట్లను సింగరేణి సంస్థ, ఎన్పీడీసీఎల్ చేయాలనానరు శివుని విగ్రహం చుట్టూ పొదలు శుభ్రం చేసి రంగురంగుల బొమ్మలతో అందంగా తీర్చిదిద్దాలన్నారు. మేడారం తరహాలో శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టి ఈ ప్రాంత సమ్మక్క జాతరకు వైభవం తీసుకురావడంతో పాటు ఈ ప్రాంతాన్ని సుందర పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి సింగరేణి సంస్థ చొరవ చూపాలన్నారు. సమ్మక్కను తీసుకువచ్చేటప్పుడు జనగామ నుంచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఏర్పాట్లు చేయాలని, పోలీస్ ఉన్నతాధికారులు సాదర స్వాగతం పలుకాలన్నారు. ఎమ్మెల్యే వెంట నగర కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, ఆర్జీ-1 డీజీఎం(సివిల్) నాగేశ్వర్‌రావు, ఎన్టీపీసీ అధికారి సూర్యనారాయణ, ఆర్ఎఫ్‌సీఎల్ అధికారి వంశీకృష్ణ, ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాస్, దేవాదయశాఖ అధికారులు సుజాతరెడ్డి, కాంతారెడ్డి, టుటౌన్ సీఐ ప్రమోద్‌రావు, జాతర కమిటీ చైర్మన్ పిన్నింటి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు దాతు శ్రీనివాస్, మహంకాళి స్వామి, ముస్తాఫా, నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, చుక్కల శ్రీనివాస్, రాజిరెడ్డి, రాయమల్లుగౌడ్, తిప్పారపు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

● గోదావరిలో స్పీడ్ బోటు నడిపిన ఎమ్మెల్యే..

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ గోదావరిలో స్పీడ్ బోటు నడిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ బోట్‌లో ఉన్నారు. రాబోయే రోజుల్లో నిరుపయోగంగా ఉన్న బోటును కూడా వినియోగంలోకి తీసుకువచ్చి ఈప్రాంతాన్ని టూరిజం కేంద్రంగా చేస్తామని ఆయన పేర్కొన్నారు.

అంతర్గాం అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం అంతర్గాం మండలంలోని బ్రాహ్మణపల్లిలో 25 లక్షల రూపాయలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించి ఈ మేరకు మాట్లాడారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఇన్‌చార్జి పెండ్రు హన్మాన్‌రెడ్డి, సర్పంచ్ బండారి ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి గీత, కాంగ్రెస్ నాయకులు మడ్డి తిరుపతిగౌడ్, చల్లా రవీందర్‌రెడ్డి, ఎంపీవో సమ్మిరెడ్డి పాలొన్నారు.

ధర్మపురిలో సంకటహర చతుర్థి పూజలు



స్వామివారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, జనవరి 29: ధర్మపురి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథశర్మ శాస్త్రోక్తంగా ఉపనిషత్‌లతో అభిషేకం, విశేష పూజలు, హారతి, మంత్ర పుష్పం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌చైర్మన్, ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెం ట్ అలువాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి జక్కు దేవేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనా నైపుణ్యాలను పెంచుకోవాలి

గణేశ్‌నగర్, జనవరి 29: విద్యార్థులు పరిశోధనా నైపుణ్యాలను పెంచుకోవాలని కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ అన్నారు. కళాశాలలో గణిత శాస్త్ర విభాగానికి సంబంధించిన విద్యార్థులు పలు అంశాలపై పరిశోధన చేసి ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ మ్యాథమెటిక్స్ రాజేష్ హాజరై విద్యార్థులకు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు గణితశాస్త్రంలో సృజనాత్మకతను పెంపొందించుకోవాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్ల సంఘం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే సురేందర్ రెడ్డి మాట్లాడుతూ గణిత శాస్త్ర అధ్యయనం వలన సమాజానికి ఉపయోగకరమైన అంశాలను కనుక్కునే అవకాశం ఉంటుందన్నారు. కళాశాల గణిత శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ వంగల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరై చక్కని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం పీజీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేష్

1న జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, జనవరి 29: టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కే పరీక్షలను గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులకు వారి చిరునామాలకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాల్‌లెటర్లు పంపించామన్నారు. ఏదైనా కారణం చేత కాల్ లెటర్ అందనివారు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. జేఎల్ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, పోల్ ఎక్కే పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీకి యత్నం

ఎల్లారెడ్డిపేట, జనవరి 29: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శివాలయం, వేణుగోపాలస్వామి బాలాలయంలో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి యత్నించారు. ఏమీ లభించకపోవడంతో వెంట తెచ్చుకున్న పరికరాలను అక్కడే వదిలి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం ఆల యానికి వెళ్లిన భక్తులకు ఇనుప చువ్వలు, పరిసర ప్రాంతాలు చిందరవందరగా కనిపించడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. వేలిముద్రల నిపుణుల బృందం నమూనాలను సేకరించింది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ఆలయ కమిటీ చైర్మన్ జితేందర్, వైస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ బాలరాజుయాదవ్ వివరాలు తెలుసుకున్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న రెండు ఆలయాల పరిసరాల్లోని సీసీ కెమెరాలు పనిచేయడం లేదని స్థానికులు పేర్కొన్నారు. పలువురు ఇళ్ల వద్ద ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. ఘటనపై వివరాలు సేకరిస్తున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గంభీరావుపేట, జనవరి 29: గంభీరావుపేట మండలం పెద్దమ్మ సమీపాన సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లా లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన వినోద్ (35)అనే వ్యక్తి బైక్‌పై పెద్దమ్మ మీదుగా సిరిసిల్ల వైపు వెళుతుండగా, గొల్లపల్లి నుంచి గోరంటాల మీదుగా గంభీరావుపేటకు వస్తున్న ప్యాసింజర్ ఆటో మూల మలుపు వద్ద ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న వినోద్ మృతి చెందగా, ఆటో డ్రైవర్ వెంకటేశంకు కాలు విరిగింది. దీంతో అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఆటోలో ఉన్న ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తజన సంద్రంగా వేములవాడ


భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం


వాహనాలతో నిండిపోయిన గుడి చెరువు పార్కింగ్ స్థలం

● 50 వేలకు పైగా భక్తుల రాక

వేములవాడ, జనవరి 29 : దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తజన సంద్రంగా మారింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకోవడానికి వేలాది మంది భక్తులు ప్రతి నిత్యం వేములవాడకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సుమారు 50 వేల మందికి పైగా భక్తులు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన శ్రీ స్వామివారి దర్శనం రాత్రంతా కొనసాగగా సోమవారం రాత్రి వరకు భక్తులు నిరంతరాయంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి శ్రీ స్వామివారి దర్శనం త్వరితగతిన సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా భక్తులు నందీశ్వరుడు వద్ద నుంచి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్న పూజలు నిలిపివేయడంతో క్యూ లైన్లు వేగంగా కదిలాయి. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కోడె మొక్కు క్యూలైన్ పార్కింగ్ స్థలం వరకు సాగడంతో మొక్కు చెల్లింపునకు సుమారు నాలుగు నుంచి ఐదు గంటల పైగా సమయం అవసరమైంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రాజన్న ఆలయ ప్రాంగణంతో పాటు ప్రధాన వీధులు, జాత్రా గ్రౌండ్ ప్రాంతం కిటకిటలాడింది. బద్ది పోచమ్మ ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. వందలాది మంది భక్తులు తలపై బోనం పెట్టుకొని క్యూ లైన్లలో గంటలకు నిరీక్షించారు. తమ వంతు రాగానే ఆలయంలో చేరుకుని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భూకబ్జాలపై కరీంనగర్‌లో ఫిర్యాదుల పర్వం

కరీంనగర్ క్రైం, జనవరి 29 : కరీంనగర్‌లో భూకబ్జాలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు సంబంధించిన ఫిర్యాదుల పర్వం కొనసాగుతున్నది. సోమవారం ఒక్క రోజే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు 70 మందికిపైగా బాధితులు పోలీస్‌కమిషనర్‌ను కలిసి వారికి జరిగిన అన్యాయాలను వివరించి, ఫిర్యాదులు చేశారు. వీరందరి ఫిర్యాదులు స్వీకరించిన సీపీ ఫిర్యాదు తీవ్రతను బట్టి ఆయా ఠాణాలకు, ఏసీపీలకు విచారణ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. కొందరు వ్యక్తిగత సమస్యలు, కుటుంబ ఆర్థిక సమస్యలపై కూడా ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిసింది. వ్యక్తిగత ఫిర్యాదులు కూడా అధికంగా రావటంతో భూకబ్జాల కేసుల విచారణపై ప్రభావం పడే అవకాశముంది. భూకబ్జాలకు సంబంధించిన ఫిర్యాదులపై ఒక్కొక్కటిగా విచారణ చేపడుతున్న ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ పోలీసు అధికారులు తప్పుడు డాక్యుమెంట్లు గుర్తించి వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించినమీదట నిందితులు, వారికి సహకరించిన వివిధ శాఖల ఉద్యోగులు, కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని వేర్వేరుగా విచారిస్తున్నారు. నివేదికను తయారు చేసి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిసింది. సోమవారం కరీంనగర్‌లోని కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ తోపాటు మరో ఇద్దరిని మూడో ఠాణాకు పిలిపించి విచారించి పంపించినట్లు సీఐ వి శ్రీనివాస్ తెలిపారు. అశోక్‌నగర్‌కు చెందిన ఒక బాధితుడు తన భూమిని కొందరు కబ్జాచేశారంటూ పోలీస్‌కమిషనర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో రికార్డులు, డ్యాకుమెంట్ల పరిశీలన, విచారణలో భాగంగా సదరు కార్పొరేటర్, మరో ఇద్దరిని పిలిపించి మాట్లాడి పంపించామని సీఐ తెలిపారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

● మార్కులు తక్కువ వచ్చాయని మనస్థాపం

కరీంనగర్ క్రైం, జనవరి 29: మార్కులు తక్కువ వచ్చాయని మనస్థాపం చెందిన కొత్తపల్లి మండలం చింతకుంటలోని గురుకుల కళాశాలలో సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న జనుప అక్షిత(17) హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.... జగిత్యాల జిల్లా మల్యాల మండలం మైనంపల్లికి చెందిన అక్షిత సాయంత్రం 7 గంటల వరకు తోటి విద్యార్థినిలతోనే కలిసి ఉంది. విద్యార్థినిలు భోజనానికి వెళ్లిన సమయంలో డ్రెస్ మార్చుకుని వస్తానని గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థులు గమనించి వార్డెన్, ఇతర సిబ్బందికి సమాచారం అందించారు. బలవంతంగా తలుపులు తెరచి ఆమెను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఆత్మహత్యకు ముందు అక్షిత సూసైడ్ లెటర్ రాసింది. తనకు కామర్స్‌లో తక్కువ మార్కులు వచ్చాయని బెస్ట్ అచీవ్‌మెంట్ బుక్‌లో తన పేరును ఎక్కించారని, తను 7 గంటలకు డిన్నర్ తరువాత చనిపోతున్నానంటూ సూసైడ్ లెటర్‌లో పేర్కొంది.

కాగా కామర్స్‌లో తక్కువ మార్కులు వచ్చిన 15 మంది విద్యార్థినిల పేర్లను బెస్ట్ అచీవ్‌మెంట్ బుక్‌లో నమోదు చేశారని, ఈ ప్రక్రియ నిత్యం జరిగేదేనని తోటి విద్యార్థులు చెబుతున్నారు. మార్కులు తక్కువ వచ్చినందుకు అంతకు ముందే అక్షిత కన్నీళ్లపెట్టుకోగా తోటి విద్యార్థులు ఓదార్చినట్లు తెలిపారు. విద్యార్థిని మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చూరి గదిలో భద్రపరిచామని పోలీసులు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

కోనరావుపేట, జనవరి 29: బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వేములవాడ డి.ఎస్.పి నాగేంద్రచారి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిమ్మపెల్లి గ్రామానికి చెందిన మానక శంకర్ ఓ బాలికపై అత్యాచారయత్నం చేసినట్లు తెలిపారు. ఈ విషయమై దర్యాప్తు నిర్వహించగా నిజం అని తేలడంతో ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 29: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,700 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 107మంది రైతులు 1,035క్వింటాళ్ల విడి పత్తి, 13మంది రైతులు 33క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6700, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

తిమ్మాపూర్, జనవరి29: దేశవ్యాప్తంగా ఐఐటి, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే తొలి విడత జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ (జేఈఈ మెయిన్) పేపర్-1 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఆరు పరీక్ష కేంద్రలలో పరీక్షలు కొనసాగుతున్నాయి. మండలం కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కరీంనగర్‌లోని అల్‌ఫోర్స్ ఉమేన్స్ డిగ్రీ అండ్ పిజి కాలేజ్, వివేకనంద డిగ్రీ అండ్ పిజి కాలేజ్, వాణీనికేతన్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, జేఎన్‌టియుహెచ్ ఇంజనీరింగ్ మంథని పరీక్ష కేంద్రాలలో రెండు సెషన్‌లలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుండి 12గంటల మొదటి సెషన్‌లో 1,309మందికి 1,289 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 20మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 3నుంచి 6గంటల జరిగిన రెండవ సెషన్‌లో 1,303 మందికి 1,282మంది విద్యార్థు లు పరీక్షకు హాజరు కాగా 21మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని ఎన్‌టిఏ సీటీ కో ఆర్డినేటర్ లలిత కుమారి తెలిపారు.


పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఈపీఎఫ్ ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి కృషి



శిబిరంలో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కోల్‌సిటీ, జనవరి 29: ఈపీఎఫ్ ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఈపీఎఫ్ఓ రీజినల్ కమిషనర్ తానయ్య సెల్వట్కార్ పేర్కొన్నారు. సోమవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐ సంస్థలు సంయుక్తంగా నిధి ఆప్‌కే నిఖత్ 2.ఓ పేరుతో అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఈపీఎఫ్ ఖాతాదారులుగా ఉన్న కార్మికులు తమ ఖాతా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా హెల్ప్‌డెస్క్ ద్వారా నమోదు చేసి పరిష్కరించారు. ఈ సందర్భంగా తానయ్య సెల్వట్కార్ మాట్లాడుతూ ఖాతాలో నిధి ఎంత ఎక్కువ ఉంటే ఖాతాదారులకు అంత ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఇన్సూరెన్స్, పదవీవిరమణ, పెన్షన్ అవసరాల నిమిత్తం రుణాలు, ఇతర ప్రయోజనాలకు సంబంధించి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఖాతాకు ఆధార్ లింకు చేయడం తప్పనిసరి అని, నామినీ పేరు చేర్చితే ఉద్యోగి మరణాంతరం వారి వారసులకు సొమ్ము సులభంగా బదిలీ అవుతుందన్నారు. ఈఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వర్ ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సంస్థ కార్మికులకు అందిస్తున్న వైద్య సదుపాయం, బీమా సదుపాయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తింప చేస్తూ నెలవారీగా జాప్యం లేకుండా సొమ్ము జమ చేస్తున్నామన్నారు. ఖాతాదారులు తమ అవసరాలకు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐ సంస్థలు మున్సిపల్ కార్పొరేషన్‌లోనే శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాయని, కార్మికులకు ఏ సమస్యలు ఉన్నా ఇందులో పరిష్కరించుకోవాలని సూచించారు.

లింకు కాలువ పనులు త్వరగా పూర్తి చేయాలి

● రామగుండం నీటిపారుదల శాఖ ఈఎన్సీ వెంకటేశ్వర్లు

ధర్మారం, జనవరి 29: మండలంలోని నంది రిజర్వాయర్ నుంచి ధర్మారం డీ83/బి ఎస్సారెస్పీ కాలువ లింకు కాలువ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని రామగుండం నీటిపారుదల శాఖ ఈఎన్సీ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం కాలువ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నంది రిజర్వాయర్ నుంచి చేపట్టిన లింకు కాలువ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేలా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. వానాకాలం సీజన్ వరకు పనులన్నింటినీ పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలని ఆయన సూచించారు. రిజర్వాయర్ నుంచి ధర్మారంలోని డి83/బి కాలువ వరకు లింకు కాలువ పనులను పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఆయన వెంట ఎస్సారెస్పీ సీఈ సతీష్‌రాజుచంద్ర, డీఈ కుమార్, ఏఈలు ఉన్నారు.

టెండర్ల ద్వారా అంజన్నకు రూ.3.88 కోట్ల ఆదాయం

మల్యాల, జనవరి 29: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో నిర్వహిస్తున్న పలు దుకాణాలకు అధికారులు సోమవారం కరీంనగర్‌లోని దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో టెండర్లు నిర్వహించారు. వచ్చే ఏప్రిల్ నుంచి మార్చి-2025 వరకు బహిరంగ వేలం, సీల్డ్ టెండర్లు, ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా నిర్వహించిన ఈ టెండర్ల ద్వారా దేవస్థానానికి రూ. 3,88,41,221 ఆదాయం సమకూరింది. గత ఏడాది రూ. 2,73,70,271 ఆదాయం సమకూరగా ప్రస్తుతం రూ. 1,14,70,950 ఆదాయం అధికంగా సమకూరింది. గతంలో కొండగట్టు దేవస్థానంలోనే టెండర్లు జరుగగా వ్యాపారుల కుమ్మక్కుతో పలుమార్లు వాయిదా పడుతుండడంతో ఈ సారి కరీంనగర్ ఏసీ కార్యాలయంలో నిర్వహించారు. దీంతో అన్నీ ఒకే రోజు ఖరారయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీ మారుతీ స్వామి, ఈవో వెంకటేష్, ఏసీ చంద్రశేఖర్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ అధికారులు ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభంపై సిఫార్సుల కమిటీ ఏర్పాటు

జగిత్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై సిఫార్సుల కమిటీని నియమించినట్లు ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేశ్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. జీవో ఆర్‌టీ నంబర్ 4 ద్వారా ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. సభ్యులుగా ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎ చంద్రశేఖర్, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, ప్రభుత్వ ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ప్రభుత్వ పరిశ్రమల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, అగ్రికల్చర్, కో ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ, నిజాం షుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్‌లను నియామకం చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెండు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందించాలని ఉత్తర్వుల్లో సూచించింది.

షుగర్ ఫ్యాక్టరీ తెరిచే విధంగా చర్యలు

● ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల టౌన్, జనవరి 29: ఏడాది లోపే రాష్ట్రంలో మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించే విధంగా సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీదర్ బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీళ్ల, నిధులు, నియామకాలు అనే నినా దంతో ఏర్పడిన రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలన కేవలం హామీలకే పరిమితమైందని ఆరోపించారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే తెరిపిస్తామని బీఆర్ఎస్ నాయ కులు హామీ ఇచ్చారన్నారు. ఇదే నినాదంతో ఎంపీగా కవిత విజయం సాధించిన 100 రోజుల్లోనే ప్రైవేటు పరంలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీ వా టా 51 శాతం తేల్చకుండానే ఉన్న ఫ్యాక్టరీని పూర్తిగా మూసివేశా రన్నారు. తెలంగాణ ప్రజలపై లక్షల కోట్ల అప్పుల భారం మోపి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలకు మాజీ సీఎం కేసీఆర్ పూర్తిగా నైతిక బాధ్యత వహించాలన్నారు. కేసీఆర్ ఆరు నెలల్లో సీఎం అవుతారని అంటున్న కేటీఆర్ వాఖ్యలపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం ఎలా అవుతారో సమాధానం చెప్పాలన్నారు. పదేళ్ల అనుభవంలో కేటీఆర్ నేర్చుకుంది ఇదేనా అన్నారు. ఈ సమావే శంలో కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు, పీసీసీ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగ భూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, నాయకులు జువ్వాడి కృష్ణారావు, గాజెంగి నందయ్య, జున్ను రాజేందర్, మన్సూర్, దుర్గయ్య ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ గాంధీ భవన్ గేట్లు తెరిస్తే బీఆర్ఎస్‌కు చెందిన ఒక్క ఎమ్మెల్యే కూడా మిగలడని కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. ఇందిరా భవన్‌లో ఆయన మాట్లాడారు. నిజామా బాద్ ఎంపీ అభ్యర్థిగా కవిత పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

ఓవర్‌లోడ్‌పై ఆటోల తనిఖీ


కరీంనగర్‌లో ఆటోల నుంచి తొలగించిన అదనపు సీట్లు

కరీంనగర్ క్రైం, జనవరి 29 : కరీంనగర్‌లో ప్రయాణికుల ఆటోలపై ట్రాఫిక్ పోలీసులు సోమవారం కొరడా ఝులిపించారు. కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆటోలను తనిఖీ చేసి డ్రైవర్ సీటుకు ఇరుపక్కల ఏర్పాటు చేసిన అదనపు సీట్లను, మ్యూజిక్ సిస్టంలు, ఇతర పరికరాలను తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లరాదన్నారు. ఈ తనిఖీలలో ట్రాఫిక్ సీఐ పర్స రమేష్, ఎస్ఐ రాజు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు సన్మానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

పాలకుర్తి, జనవరి 29: రామగుండం నియోజకవర్గం ఎమ్మెల్యేగా విజయం సాధించిన రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌కు బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కంపెని పర్మినెంటు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కంపెనీ ప్రధానద్వారం ఎదుట భారీ అభినందన, సన్మాన సభ నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ మాట్లాడారు. ఈ ప్రాంతంలో పుట్టిపెరిగిన వాడిగా ఈ ప్రాంత సమస్యలపై తనకు పూర్తి పట్టుందని, కేశోరాం కార్మికుల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్నానని తెలిపారు. కార్మికులకు మరిన్ని మెరుగైన హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్మికుల పదవీ విరమణ వయసు 58 నుంచి 61 ఏళ్లకు పెంచేలా ప్రయత్నిస్తానన్నారు. మండలంలోని కొత్తపల్లిలో సైతం మక్కాన్‌సింగ్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి దాడి మహేష్, వర్కింగ్ ప్రెసిడెంటు పర్శవేణి శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, పాలకుర్తి మాజీ ఎంపీటీసీ దేవనందుల రాజమొగిళి, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నెగ్గిన అవిశ్వాసం.. తాత్కాలిక చైర్మన్‌గా సంపత్

పెద్దపల్లి రూరల్, జనవరి 29: మండలంలోని అప్పన్నపేట వ్యవసాయ సహకార సంఘంలో డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసం సోమవారం నెగ్గింది. ఈ నెల 8న సహకార సంఘంలోని 10 మంది డైరెక్టర్లు చైర్మన్ దాసరి చంద్రారెడ్డిపై అవిశ్వాసం పెట్టారు. ఈ మేరకు సోమవారం జిల్లా సహకార అధికారిణి శ్రీమాల అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో 13 మంది డైరెక్టర్లు ఉండగా ఇందులో 11 మంది డైరెక్టర్లు అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తారు. దీంతో వైస్ చైర్మన్ చింతపండు సంపత్‌ను తాత్కాలిక చైర్మన్‌గా జిల్లా సహకార అధికారి శ్రీమాల నియమించినట్లు తెలిపారు.

ఘనంగా పేరెంట్స్ డే

పాలకుర్తి, జనవరి 29: మండలంలోని జీడీనగర్ యూనివర్సల్ ఐఐటీ ఫౌండేషన్ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను వేదికపై కూర్చోపెట్టి విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంటు మహమ్మద్ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే విజయరమణారావు





అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, వినతిపత్రం అందిస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 29: గ్రామాల సమగ్రాభివృద్ధి తన లక్ష్యమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని పెద్దరాతుపల్లి గ్రామంలో ఐదు లక్షల నిధులతో చేపట్టే గ్రామపంచాయతీ ప్రహరీ నిర్మాణం, 25 లక్షల నిధులతో చేపట్టే పశువైద్య ఆసుపత్రి, 20లక్షల రూపాయలతో చేపట్టే హెల్త్ సబ్‌సెంటర్‌కు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, గ్రామాల అభివృద్ధి కోసం తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఎన్నికలు ఇచ్చిన హామీ ప్రకారం విడతల వారీగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని, ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు గ్యారంటీలను అమలు చేశారన్నారు. పెద్దరాత్‌పల్లి గ్రామ అభివృద్ధి కోసం సర్పంచ్ ఓరుగంటి కొమురయ్య ఐదు సంవత్సరాలుగా ఎన్నో నిధులు తీసుకువచ్చి గ్రామ రూపురేఖలే మార్చారని సర్పంచ్ ఓరుగంటి కొమురయ్యను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం గ్రామంలోని పోచమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే గ్రామానికి రావడంతో సర్పంచ్ కొమురయ్యగౌడ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, సర్పంచ్ ఓరుగంటి కొమురయ్యగౌడ్, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, ఎంపీడీవో రాంమోనచారి, తహసీల్దార్ జాహెద్‌పాషా, ఏఈ జగదీష్, సూపరిం టెండెంట్ సురేష్, వెటర్నరీ డాక్టర్లు సురేష్, సునీత, ప్రభుత్వ డాక్టర్ శ్రీనివాస్, ఎంపీడీవో బోల్లమల్ల కౌసల్య, శంకర్, ఉపసర్పంచ్ అల్లంల మహేష్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ మునీర్ పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యూలర్ చేయాలి

కాల్వశ్రీరాంపూర్: ప్రభుత్వం తమను రెగ్యులర్ చేయాలని రెండో ఏఎన్‌ఎంలు పెద్దరాతుపల్లిలో సోమవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుకు వినతిపత్రం అందజేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో ప్రభుత్వం రెండో ఏఎన్‌ఎంలను నియమించిదన్నారు. 16సంవత్సరాలుగా కాంట్రాక్టు ఏఎన్‌ఎంలుగానే పనిచేస్తున్నామని, రెగ్యులర్ ఏఎన్‌ఎంలతో సమానంగా పనిచేస్తున్నామన్నారు. తమను రెగ్యులర్ చేసేందుకు సహకారం అందించాలని ఎమ్మెల్యేకు వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పద్మ, సునీత, సరిత, సరోజన ఉన్నారు.

స్పందన విద్యార్థుల వ్యవసాయ క్షేత్ర పర్యటన



పొలంలో నాటు వేసే ప్రక్రియను పరిశీలిస్తున్న విద్యార్థులు

య్యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 29: స్పందన మోడల్ స్కూల్ విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు గాను సోమవారం ఆదర్శనగర్‌లోని సానా వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. అక్కడ పొలంలో నాట్లు వేయడం, కలుపు తీయడం విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల రకాలు, ఆకుకూరలు, సేంద్రీయ వ్యవసాయం, వ్యవసాయ పనిముట్లపై వ్యసాయ క్షేత్ర యజమాని సానా రామకృష్ణారెడ్డి విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయనీ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఆవరణలో పూలే దంపతుల విగ్రహాలను పెట్టాలి

మంథని, జనవరి 29: తెలంగాణ అసెంబ్లీ అవరణలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహంతో పాటు ఆయన సతిమణి సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు సీఎం రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌లను కోరారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పుట్ట మధు మాట్లాడారు. అసెంబ్లీలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని అసెంబ్లీ అవరణలో ఏర్పాటు చేయాలనే కవితకు తమ మద్దతు ఇస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కూడా మహనీయుల చరిత్రను ప్రజలకు తెలియనివ్వలేదన్నారు.

పేదల చదువు కోసం ఈ దేశానికి ఎంతగానో కృషి చేసిన జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను తప్పకుండా అసెంబ్లీ అవరణలో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. కవిత ఆలోచనను తాము కూడా బలపరుస్తూ నియోజకవర్గం లోని బీఆర్ఎస్ నాయకులతో సంతకాలు సేకరించి విగ్రహాలను ఏర్పాటు చేయాలని అసెంబ్లీ స్పీకర్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్, కాయితీ సమ్మయ్య, నక్క శంకర్, వెల్పుల గట్టయ్య, గొబ్బూరి వంశీ, కొట్టే రమేష్, అక్కపాక సంపత్, ఆసీఫ్, గట్టు రాధాకృష్ణలు తదితరులు పాల్గొన్నారు.

ఖని ఆర్టీసీ డిపోకు మూడు రాజధాని సర్వీసులు

కళ్యాణ్‌నగర్, జనవరి 29: గోదావరిఖని ఆర్టీసీ డిపోకు మూడు కొత్త రాజధాని సర్వీసులు కేటాయించినట్లు గోదావరిఖని డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రాజధాని బస్సులను హైదరాబాద్‌కు నడిపిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ సర్వీసులను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్ర రహదారిపై ప్రమాదాల నివారణ చర్యలు

ధర్మారం, జనవరి 29: ధర్మారం పోలీస్ స్టేషన్ ఎదుట రాష్ట్ర రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు. సోమవారం రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా ధర్మారంలో రాష్ట్ర రహదారి పక్కన ఠాణా, తహసీల్దార్ కార్యాలయం, బ్యాంకు ఉన్నందున తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఎస్సై సత్యనారాయణ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రాష్ట్ర రహదారిపై రంబుల్ స్ట్రీప్స్ వేయించారు. వీటి ఫలితంగా రోడ్డుపై వాహనాల వేగం తగ్గి ప్రమాదాలు తగ్గుతాయని ఎస్సై సత్యనారాయణ అన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి మంత్రి 'పొన్నం' పరామర్శ



రాజేశం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

పెద్దపల్లి టౌన్, జనవరి 29: ఒక న్యూస్ ఛానల్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి కుటుంబాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పరామర్శించారు. పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లికి చెందిన వెంకటేష్ తండ్రి పూదరి రాజేశం ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపగాని సారయ్య, రేగుంట అశోక్, తాడూరి శ్రీమాన్ తదితరులు మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్ తదితరులు పరామర్శించారు.

రైస్‌మిల్ ఆపరేటర్ల సమ్మె నోటీసు



రైస్‌మిల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు సమ్మె నోటీసు అందిస్తున్న దృశ్యం

సుల్తానాబాద్, జనవరి 29: సుల్తానాబాద్ రైస్ మిల్ ఆపరేటర్స్, గుమస్తాల యూనియన్స్ ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని సోమవారం సుల్తానాబాద్ రైస్‌మిల్ ఓనర్స్ అసోసియేషన్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలుగా నిర్ణయించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె చేయాలని జాతీయస్థాయిలో అన్ని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. సమ్మె పోరాటంలో రైస్ మిల్లు ఆపరేటర్స్, గుమస్తాలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షులు తాండ్ర అంజయ్య, గుమస్తాల సంఘం అధ్యక్షులు మాతంగి రాయమల్లు, బ్రహ్మచారి, బాలకృష్ణ, తిరుపతి, శంకర్, అనిల్, స్వామి, నరసయ్య, రాము పాల్గొన్నారు.

నేడు సుల్తాన్‌పూర్ పాఠశాల వార్షికోత్సవం

ఎలిగేడు, జనవరి 29: ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌లోని ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలు స్థాపించి 75ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం పాఠశాలలో ప్లాటినం జూబ్లీ వేడుకలను నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎంలు నరేంద్రచారి, సంతోష్‌రెడ్డి తెలిపారు. ఈ ఉత్సవాలకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేస్తున్న తిరుమల చార్యులు


రామగిరి, జనవరి 29: రామగిరి మండలం పన్నూరు గ్రామపంచాయతీలోని కస్తూర్బా పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని మారుతీనగర్ ఆంజనేయ స్వామి ఆలయ దివంగత అర్చకుడు సౌమిత్రి నారాయణచార్యులు స్మారకార్థం ఆయన కుమారుడు తిరుమలచార్యులు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

జూలపల్లి, జనవరి 29: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను నిజం చేసేందుకు విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నతంగా ఎదగాలని పూర్వపు విద్యార్థి సామాజిక సేవకులు కన్నం భరత్ అన్నారు. జూలపల్లి మండలంలోని వడుకాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు పూర్వపు విద్యార్థుల సహకారంతో కన్నం భరత్ నోట్‌బుక్‌లు, పెన్నులను సోమవారం పాఠశాలలో అందజేశాడు. పదో తరగతి విద్యార్థు లకు తమ వంతు కృషి చేయాలని ఆ పాఠశాలలో చదివిన మిత్రుల సహ కారం కోరగా వారు స్పందించారన్నారు. వారి సహకారంతో నోట్‌బుక్‌లు, పెన్నులను సమకూర్చి విద్యార్థులకు అందించినట్లు భరత్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో విద్యార్థుల విద్యాభివృద్ధికి తన మిత్రుల సహకారంతో మరిన్ని మెరుగైన సేవలు అందించనున్నట్లు ఆయన తెలిపాడు. పదో తరగతి విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు అందించడం పట్ల కన్నం భరత్‌కు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా సంకటహర చతుర్థి వేడుకలు

మంథని, జనవరి 29: పట్టణంలోని శ్రీమహాగణపతి ఆలయంలో సంకటహర చుతుర్థి వేడుకలను భక్తులు సోమవారం వైభవంగా నిర్వహించారు. సంకట హర చతుర్థిని పురస్కరించుకొని శ్రీమహాగణపతి స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు పల్లి రాము ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజించారు. భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయ అవరణ భక్తులతో సందడిగా మారింది.



ఆర్జీ-2లో అంతర్గత పోస్టులకు రాత పరీక్ష



పరీక్ష తీరును పరిశీలిస్తున్న జీఎం

య్యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 29: ఓసీపీ-3లో ఖాళీగా ఉన్న ట్రిప్ మెన్, డంప్ మెన్ పోస్టులకు సోమవారం సెక్టార్-3 సింగరేణి స్కూల్‌లో రాత పరీక్షలు నిర్వహించారు. జీఎం సూర్యనారాయణ ప్రశ్నా పత్రాల సీల్ ఓపెన్ చేసి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. 3 ఖాళీ పోస్టులకు గాను 107 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 93 మంది పరీక్షకు హాజరయ్యారు. ఫలితాలను సాయంత్రం జీఎం కార్యాలయ నోటీస్ బోర్డులో ఉంచారు. ఎస్వోటూ జీఎం అబ్దుల్‌సలీం, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, డీజీఎం ఐఈడీ మురళీకృష్ణ, పర్సనల్ అధికారులు వేణుగోపాల్, వంశీధర్, సురేందర్ పరీక్ష నిర్వహణ బాధ్యతలు చూశారు.

క్రీడాకారులకు దుస్తుల అందజేత

య్యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 29: ఆర్జీ-2 ఏరియా వర్క్ పీపుల్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జీఎం సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై దుస్తుల ను అందజేశారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, డీవైపీఎంలు వేణుగోపాల్, వంశీధర్, స్పోర్ట్స్ సూపర్ వైజర్ నరేందర్‌రెడ్డి, ఎస్ఎస్ఓ షరీప్ మహమ్మద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సిటార్స్‌లో సర్వేయర్లకు శిక్షణ తరగతులు



శిక్షణా తరగతులకు హాజరైన సర్వేయర్లతో అధికారులు

య్యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 29: సింటార్స్ శిక్షణా కేంద్రంలో సర్వేయర్లకు ఆటోకాడ్ సివిల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీపై శిక్షణా తరగతులను సోమవారం సింగరే ణి సేఫ్టీ జీఎం గురువయ్య ప్రారంభించారు. సింగరేణి వ్యాప్తంగా 24 మంది సర్వేయర్లకు ఆటోక్యాడ్ త్రీడీ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీపై రెండు వారాల పాటు శిక్షణ తరగతులు జరగనున్నాయి. ఈసందర్భంగా గురువయ్య మాట్లాడారు. సింగరేణి 100 మిలియన్ టన్నుల లక్ష్యం దిశగా దూసుకుపోతున్న క్రమంలో భారీ ఉత్పత్తి సాధించడానికి ఓపెన్‌కాస్ట్ గనులపై ఆధారపడి పని చేస్తున్నామని అన్నారు. ఓసీపీ గనుల లక్ష్యాలలో ఆటోకాడ్ సివిల్ త్రీడీ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఎంతో ఉపయోగకరంగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఈటెక్నాలజీ ద్వారా ఆఫ్ లోడింగ్ వర్క్ లలో లోపాలను తగ్గించడానికి ఖచ్చితమైన సర్వే మరియు లెక్కలు అవసరమని, డ్రాయింగ్, డిజైన్‌లు ఉపయోగించబడుతుందని గురువారెడ్డి పేర్కొన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని టెక్నాలజీపై పూర్తి అవగాహన పెంచుకోవాలని జీఎం సూర్యనారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో సింటార్స్ డీజీఎం ఏకేకే శర్మ, డీజీఎం ఎస్‌డీ హుస్సేనీ పాల్గొన్నారు.

మైనింగ్ సర్దార్ మృతికి యాజమాన్యం బాధ్యత వహించాలి

బెల్లంపల్లి, జనవరి 29: మైనింగ్ సర్దార్ సమ్మిరెడ్డి మృతికి సింగరేణి యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్, ఉపాధ్యక్షుడు గద్దెల నారాయణ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయలు చెల్లించాలని, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. గని ప్రమాద కారకులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

గని ప్రమాద బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

● మృతుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి ● సమ్మిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్





సమ్మిరెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, కార్మికులతో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

గోదావరిఖని, జనవరి 29: గని ప్రమాద బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఆర్జీ-1 పరిధిలోని జీడీకే2ఏ ఇంక్లైన్‌లో జరిగిన ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన మందాడి సమ్మిరెడ్డి కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సింగరేణి ఏరియా ఆసుపత్రిలో సమ్మిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అతని కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న టబ్బు లింకు తెగిపోయి సీనియర్ మైనింగ్ సర్దార్ మందాడి సమ్మిరెడ్డి తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి ఆదివారం రాత్రి మృతి చెందాడన్నారు. సమ్మిరెడ్డి మృతి తనను కలిచివేసిందన్నారు. ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, విచారణ వేగవంతం చేయాలని సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను కోరారు. కుటుంబంలో ఒకరికి కోరుకున్న విధంగా స్యూటబుల్ జాబ్‌ను ఇవ్వాలని కోరారు. యాజమాన్యానికి ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల ప్రాణాలపై లేదని, ఇప్పటికైనా రక్షణ చర్యలను పటిష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమ్మిరెడ్డి కుటుంబాన్ని పరామార్శించిన వారిలో కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, రవికుమార్, గోగుల రవీందర్‌రెడ్డి, జనగామ సది తదితరులు ఉన్నారు.

● కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలి..

గోదావరిఖని: గని ప్రమాదంలో గాయపడి మృతి చెందిన మైనింగ్ సర్దార్ మందాడి సమ్మిరెడ్డి కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, ఇతర బెనిఫిట్స్‌ను చెల్లించాలంటూ సోమవారం గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ప్రమాదం జరిగినప్పుడు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని హామి ఇచ్చి యాజమాన్యం చేతులు దులుపుకుంటుందని, సమ్మిరెడ్డి కుటుంబానికి కోటి రూపాయలు చెల్లించే వరకు పోస్టుమార్టం జరుగనివ్వమంటూ కార్మిక సంఘాల నాయకులు పట్టుబట్టారు. కార్మికునికి కుటుంబంలో ఒకరికి స్యూటబుల్ జాబ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి, బీఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య మాట్లాడుతూ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం జరిగిందని, కార్మికుని కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారంతో పాటు ఇతర బెనిఫిట్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో సరైన వైద్యం లభించకనే సమ్మిరెడ్డి మృతి చెందాడని, తీవ్రంగా గాయపడిన సమ్మిరెడ్డి మొదటగా హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారన్నారు. అక్కడ సరైన వైద్యం లభించకపోవడంతో యశోద ఆసుపత్రికి తరలించారని, యశోద వైద్యులు సకాలంలో సమ్మిరెడ్డిని తీసుకువస్తే బ్రతికేవాడని చెప్పారని, కానీ సమ్మిరెడ్డికి వైద్యం అందకనే మృతి చెందాడని ఆరోపించారు. ఆసుపత్రిలో కార్మికులకు మెరుగైన వైద్యం లభించకపోవడం వల్ల ఒకే నెలలో ఇద్దరు కార్మికుడు మృతి చెందడం బాధకరమన్నారు. సమ్మిరెడ్డి కూతురు కానీ, కుమారునికి గానీ సుటబుల్ ఉద్యోగం కల్పించాలని, ఎలాంటి నియమనిబంధనలు పెట్టకుండా చూడాలన్నారు. సింగరేణిలో రానురాను రక్షణ చర్యల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నారని, సేఫ్టీ ఆఫీసర్లు పని స్థలాలను పరిశీలించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ఏఐటీయూసీ నాయకులు ఆరెల్లి పోషం, మడ్డి ఎల్లయ్య, రంగు శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు మెండె శ్రీనివాస్, ఎస్‌కే గౌస్, రాజమౌళి, ఐఎన్‌టీయూసీ నాయకులు ధర్మపురి, కత్రోజు మోహన్, మైనింగ్ సర్దార్ అసోసియేషన్ నాయకులు మాదాసు రామమూర్తి తదితరులు ఉన్నారు.

అధికారులకు ఆత్మీయ సత్కారం



అదికారులను సత్కరిస్తున్న జీఎంలు

రామగిరి, జనవరి 29: సింగరేణి సంస్థ ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో సోమవారం ఉద్యోగ విరమణపొందిన రిజియన్ సేఫ్టీ జీఎం ఎన్. సాంబయ్య రిజియన్ సివిల్ క్వాలిటీ మేనేజ్మెంట్ ప్రసాద్‌రావులను ఆర్జీ-3,ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు శాలువ, పూలదండలతో ఘనంగా సత్కారించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అధికారులు బైద్య, రఘుపతి, శ్రీనివాసులు, రాధాకృష్ణ, రమేశ్, వెంకటరమణ, జైనులబద్దీన్, పద్మరాజు, కాశీ విశ్వేశ్వర్‌రావు, రవీం దర్‌రెడ్డి, రాజారెడ్డి, సత్యనారయణ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సీఎంవోఏ అధ్యక్షుడిగా వెంకటరమణ

రామగిరి, జనవరి 29: సింగరేణి కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా సీహెచ్ వెంకటరమణ(డీజీఎం) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నాగేశ్వర్‌రావు(ఎస్ఈ), శ్రీకాంత్ (డీవైఎస్ఈ), సెక్రెటరీగా జి శ్రీనివాస్(ఎస్ఈ), జాయింట్ సెక్రెటరీగా సత్యనారాయణ(డీవైఎస్ఈ), జాయింట్ సెక్రెటరీగా పి రమేశ్ (డీవైఎస్ఈ), కోశాధికారులుగా శ్రవణ్‌కుమార్ (ఎఫ్ఎమ్), పి మహేందర్ (సర్వే ఆఫీసర్) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులు సంబరాలు నిర్వహించారు. ఆదికవారం జరిగిన ఈ ఎన్నికకు చీఫ్ ఎన్నికల అధికారిగా గురువయ్య(కొత్తగూడెం) ఏరియా రిటర్నింగ్ అధికారి ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు వ్యవహరించారు.



సంబరాల్లో సీఎంవోఏ కార్యవర్గం

ఐక్య పోరాటాలతోనే డిమాండ్ల సాధన

గోదావరిఖని, జనవరి 29: ఐక్య పోరాటాలతోనే డిమాండ్లు సాధించుకున్నామని మైనింగ్ స్టాఫ్ అసోసియేషన్ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీడీకే 2ఏ గని ప్రమాదంలో మరణించిన మైనింగ్ సర్దార్ సమ్మిరెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని మైనింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించామని, సింగరేణిని ప్రధాన సంఘాలు, నాయకులు మద్దతు ప్రకటించి ఐక్యంగా పోరాటం చేయడంతోనే డిమాండ్లు సాధించుకున్నామని మైనింగ్ స్టాఫ్ అసోసియేషన్ నాయకులు మాదాసు రామమూర్తి, నాగెల్లి సాంబయ్య పేర్కొన్నారు. బాధితుడి కుటుంబానికి స్యూటబుల్ ఎంప్లాయిమెంట్ ఇచ్చేందుకు యాజమాన్యం ఒప్పుకుందన్నారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, సింగరేణి సీఎండీ బలరాంనాయక్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.